క్లుప్తంగా

గవర్నర్‌కు జన్మదిన శుభాకాంక్షలు



గవర్నర్ తమిళిసైకి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న సతీష్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్

షాబాద్: గవర్నర్ తమిళిసై పుట్టిన రోజు సందర్భంగా తెలంగాణ రాష్ట్ర లీగల్ సెల్ నాయకులు సతీష్‌రెడ్డి, పెద్దవేడు గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్ ఆమెను నగరంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాజ్‌భవన్‌కు వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి, పుట్టిన రోజు, తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



బాధిత కుటుంబ సభ్యులతో సర్పంచ్ ఆంజనేయులు తదితరులు

కేశంపేట: మండలంలోని ఇప్పలపల్లిలో గురువారం పెంటయ్య అనారోగ్యంతో మృతి చెందారు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో అంత్యక్రియల నిమిత్తం స్త్రీశిశు సంక్షేమ శాఖ స్టాండింగ్ కమిటీ జిల్లా చైర్‌పర్సన్ టీ విశాల రూ. 5 వేలు, షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వీ లక్ష్మీనారాయణగౌడ్ రూ. 5వేలు సమకూర్చారు. ఈ మొత్తాన్ని శుక్రవారం గ్రామ సర్పంచ్ ఆంజనేయులు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు, శ్రీను, శివ తదితరులు పాల్గొన్నారు.

వివేకానంద విగ్రహ ఏర్పాటుకు విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న అనంత్‌రెడ్డి

చేవెళ్ల: పట్టణంలో వివేకానంద విగ్రహ ఏర్పాటుకు బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి ఏ అనంత్‌రెడ్డి రూ. లక్ష 16వేలు విరాళం అందజేశారు. శుక్రవారం గ్రామపెద్దలు, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, నాయకులు విఠల్‌రెడ్డి, ఆగిరెడ్డి, పాండురంగారెడ్డి సమక్షంలో దాత అనంత్‌రెడ్డి విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని యువత ఆదర్శంగా నిలిచేందుకు స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అలాంటి మహనీయులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దాతల సహాయంతో విగ్రహం ఏర్పాటుకు ముందుకు వచ్చిన గ్రామ పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మధు

శంకర్‌పల్లి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఎస్ మధు ముదిరాజ్ అన్నారు. శుక్రవారం శంకర్‌పల్లిలోని అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని కోరారు. సీఎం కేసీఆర్ ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ కమిటీ చైర్మన్ ఆత్మ లింగరం, సభ్యులు మోహన్, శ్రీనివాస్, జంగయ్య, ప్రతీక్‌కుమార్, పాండురంగారెడ్డి, విశ్వేశ్వర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు చేస్తే సహించం

షాద్‌నగర్: ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, సర్వర పాషా, వెంకట్‌రాంరెడ్డి, యాదగిరి మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌పై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే పదవి, వయస్సు, హోదా తెలియకుండా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. స్వార్థ రాజకీయాల కోసం ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. సమావేశంలో నాయకులు విశ్వం, వెంకట్‌రాంరెడ్డి, ఖాజా ఇద్రీస్, సర్వర్ పాషా, లక్ష్మీనర్సింహారెడ్డి, శంకర్, శేఖర్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కేశంపేట: జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ రవీందర్ యాదవ్



కేశంపేట: సోనియాగాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు



షాద్‌నగర్ క్యాంపు కార్యాలయం వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య



చేవెళ్లలోని క్యాంపు కార్యాలయం వద్ద జెండాకు వందనం చేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ఘనంగా 'దశాబ్ది' ఉత్సవాలు

తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను షాద్‌నగర్, చేవెళ్ల నియోజకవర్గాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు వేడుకల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు వారివారి కార్యాలయాల్లో దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు.

– సాక్షి, నెట్‌వర్క్



మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయం వద్ద..



చేవెళ్ల పీఏసీఎస్ కార్యాలయం వద్ద జాతీయ జెండాకు వందనం చేస్తున్న నాయకులు, అధికారులు



షాద్‌నగర్: జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు



శంకర్‌పల్లి: మున్సిపల్ కార్యాలయం వద్ద..



షాబాద్: జెండాకు వందనం చేస్తున్న తహసీల్దార్ తదితరులు



షాబాద్ పోలీస్‌స్టేషన్ వద్ద జెండాను ఆవిష్కరిస్తున్న సీఐ



కొత్తూరు: తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న చైర్‌పర్సన్ లావణ్య



కొత్తూరు ఎంపీడీవో కార్యాలయం వద్ద..



కొందుర్గు: చౌదరిగూడలో..



మొయినాబాద్: యాదిరెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెండింగ్ కేసుల పరిష్కారానికే లోక్ అదాలత్

విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు

చేవెళ్ల: ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఉన్న పెండింగ్ కేసులను పరిష్కరించుకునేందుకే లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు విశ్రాంత సీనియర్ సివిల్ జడ్జి సాంబశివరావు అన్నారు. చేవెళ్ల కోర్టు ఆవరణలో శుక్రవారం రెండో రోజు ట్రాఫిక్ పోలీసు కేసులపై లోక్ అదాలత్ కొనసాగింది. ఈ సందర్భంగా చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్‌పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన ట్రాఫిక్ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. రెండవ రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 108 పరిష్కరించినట్లు తెలిపారు. రూ. 3లక్షల 5వేలు జరిమానా వసూలు చేసినట్లు వివరించారు. ట్రాఫిక్ రూల్స్ విధిగా పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదన్నారు. ఈ నెల 10వ తేదీ వరకు లోక్ అదాలత్ కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ వాసు, షాబాద్ సీఐ గురువయ్యగౌడ్, ట్రాఫిక్ ఏఎస్ఐ చందర్ నాయక్, కోర్టు సిబ్బంది నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఇచ్చింది, తెచ్చింది కాంగ్రెస్సే

నందిగామ: ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సోనియా గాంధీ ఇచ్చిందని, ఇచ్చిన తెలంగాణలో బీఆర్ఎస్ నాయకులు దోచుకుంటున్నారని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ ఆరోపించారు. నందిగామలో పార్టీ మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రాన్ని సోనియా గాంధీ ఇచ్చిందని గుర్తు చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, సీతారాం, రవీందర్, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు పత్రికల్లో పనిచేస్తున్న పాత్రికేయులను, తెలంగాణ ఉద్యమకారులను పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్ సన్మానించారు.



చేవెళ్ల మండలం పామెన గ్రామంలో బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న వాటర్ ఫిల్టర్ ప్లాంట్‌కు సినీ నటుడు, యాంకర్ బిత్తిరి సత్తి రూ. లక్ష విరాళం అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును శుక్రవారం గ్రామ సర్పంచ్ ఎ.మల్లారెడ్డికి అందజేశారు.

- చేవెళ్ల

'కంటి వెలుగు'.. పేదలకు ఎంతో మేలు

శంకర్‌పల్లి: కంటి వెలుగు కార్యక్రమం పేదలకు ఎంతగానో ఉపయోగమని మున్సిపల్ చైర్‌పర్సన్ సీ విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 3వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పేద ప్రజల కంటి సమస్యలను పరిష్కరించేందుకే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. కంటి వెలుగు శిబిరాలను ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. కంటి సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు పార్శి రాధ, శ్రీనాథ్‌గౌడ్, సంతోష్, శ్వేత, కోఆప్షన్ సభ్యులు రజిని, మైమూద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నీటి కోసం పంచాయతీ కార్యాలయం ముట్టడి

కొందుర్గు: తాగునీటి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని ఉమ్మెంత్యాల గ్రామస్తులు శుక్రవారం పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. గ్రామానికి మిషన్ భగీరథ నీళ్లు సరిగ్గా రావడం లేదని, బోర్లు ఉన్నా పని చేయడం లేదని వివరించారు. నీటి సమస్యను పలుమార్లు అధికారులు, పాలకులకు తెలిపినా వారు పట్టించుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే నీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

'దశాబ్ది' వేడుకలకు హెచ్‌ఎం డుమ్మా

నందిగామ: విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తున్నా కొందరి ఉపాధ్యాయుల తీరు వల్ల అపకీర్తి వస్తోంది. ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో మండలంలోని నర్సప్పగూడ జెడ్పీహెచ్ పాఠశాల విద్యార్థులు ఒక్కరూ కూడా ఉత్తీర్ణత కాలేదు. అయినా సిబ్బంది తీరులో ఏ మాత్రం మార్పు రాలేదు. రాష్ట్ర అవతరణ వేడుకలకు హెచ్‌ఎం విధిగా హాజరు కావాల్సి ఉంది. అయితే వేడుకలకు హెచ్‌ఎం డుమ్మా కొట్టారు. దీంతో సిబ్బంది జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ విషయమై ఎంఈఓ కృష్ణారెడ్డిని వివరణ కోరగా తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలకు హెచ్‌ఎం రాకపోవడం దారుణమన్నారు. అనివార్య కారణాలతో రాలేకపోతే ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకొని ఇన్‌చార్జ్‌కు బాధ్యతలు అప్పగించాల్సి ఉంటుందన్నారు.

'లక్ష్మీదేవిపల్లి' నిర్మించే వరకూ పోరాటం

వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇబ్రహీం

షాద్‌నగర్: హామీ మేరకు సీఎం కేసీఆర్ లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించాల్సిందేనని, అప్పటి వరకు తమ పోరాటం ఆగదని వైఎస్సార్ టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎండీ ఇబ్రహీం అన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌టీపీ, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా షాద్‌నగర్ పరిధిలోని చౌదరిగూడ మండలంలో లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను నిర్మిస్తామని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఉద్దండాపూర్ నుంచి గ్రావిటీ ద్వారా షాద్‌నగర్ ప్రాంతానికి నీళ్లు తరలిస్తామని సీఎం చెప్పడం జరిగిందన్నారు. అంటే ఈ ప్రాంతంలో రిజర్వాయర్ నిర్మించకుండా ప్రభుత్వం ఇక్కడి ప్రజలు, రైతులను మోసం చేస్తోందన్నారు. కమీషన్ల కోసం



రిలే నిరాహార దీక్షలో నేతలు

సీఎం ఈ ప్రాజెక్టుకు రీ డిజైన్ చేసి ప్రాజెక్టు స్వరూపాన్నే పూర్తిగా మార్చేస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేక రాష్ట్రం వచ్చాక కూడ సీఎం నీళ్ల విషయంలో ఉమ్మడి పాలమూరు జిల్లాకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. రిజర్వాయర్ నిర్మాణ పనులు ప్రారంభించే వరకు తమ పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు అర్జునప్ప, రవీంద్రనాథ్, సుదర్శన్, రాము, బాలకిష్టయ్య, జహంగీర్, శ్రీశైలం, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా కన్వీనర్‌గా నరేష్

షాద్‌నగర్: బీజేపీ ఎస్సీ మోర్చా షాద్‌నగర్ నియోజకవర్గ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన ఏ నరేష్ ఎన్నికయ్యారు. శుక్రవారం మొయినాబాద్‌లో బీజేపీ జిల్లా ఎస్సీ మోర్చా పదాధికారుల సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు బీ రమేష్ అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్య పరుస్తానని పేర్కొన్నారు.